
# తూతూ మంత్రం



'హాస్యానందం' మాసపత్రిక . . . జూలై' 2005

అందరికీ పండగలా ఉంది!

ఇన్నాళ్లూ పోలేరమ్మ తిరునాళ్ళు, నాంచారమ్మ జాతర సంబరాలు మాత్రమే తెలుసు. ఇంకో పండుగల్ని ఈమధ్య కాలంలోనే చూస్తున్నారు.

'ఇరుకు ఈశ్వరి' కార్యక్రమాలు నిర్వహిస్తూందంటే రాకపోతారా.. రాకపోతే పోతూరుగానీ!

ఎలాగైనా ఈశ్వరి ఉండాల్సిన అమ్మాయి...

'అమ్మాయి' అంటే అలా కనిపించే, అనిపించే అమ్మాయి! ఈశ్వరి భర్త పార్వతీశం పోయిన కృష్ణా పుష్కరాలలో కనిపించకుండాపోయాడు. భార్య మీద అలిగో... తన మీద తాను అలకబూనో వేలాదిమంది జనంలో కలిసిపోయాక- ఇక కన్పించలేదు.

మంత్రాల సాయిబు దగ్గరికి ప్రశ్నకెళ్లింది ఈశ్వరి!

ఎక్కడో క్షేమంగానే ఉన్నాడు. మరల వచ్చే కృష్ణా పుష్కరాల నాటికి క్షేమంగా వచ్చి తీరతాడని సెలవిచ్చాడు. అప్పటినుండి ఈశ్వరి టైమ్‌వేస్ట్ చేయడం ఇష్టంలేక ఇలా సమాజసేవ చేయడం నేర్చుకుంది.

లేకపోతే 'ఇటు అటు పాడు' లాంటి ఓ మోస్తరు పట్టణంలో 'ఇరుకు ఈశ్వరి సాంస్కృతిక సేవాసంస్థ'ను స్థాపించి సమాజసేవ చేస్తుందంటే మాటలా?! ఇరుకు ఈశ్వరి తన విస్తృతమైన అభిరుచులతో, ఆశయాలతో అందరి అభిమానానికి పాత్రురాలయింది.

'ఇటు అటు పాడు' పట్టణంలో ఇరుకు ఈశ్వరి అంటే... ఈనాడు ఒక వ్యక్తి గాదు, ఒక శక్తి' అనే స్థాయికి ఎదిగిపోయింది.

'అమ్మడు ప్రోగ్రాం' అంటే... అందరికీ మొదట్లో మొహంమొత్తేది. కానీ, ఏమాత్రం డీలాపడిపోలేదు. మొక్కవోని శ్రద్ధను కనబర్చింది. అయితే ఇప్పుడు ప్రజలు మొహం వాచిపోయేలా ఎదురుచూస్తున్నారు.

'ఆ ఆకర్షణ తన ప్రోగ్రామ్స్ ద్వారానా? లేక, తన ద్వారానా?' ...అన్న సందేహం గజ్జల గజలక్ష్మికి! ఆమె ఓ సంఘ సేవకురాలిగానో, లేక కళాకారిణిగానో మంచిపేరు సంపాదించుకోవాలని ట్రై చేసి, ఫెయిలైన మనిషి!

'ఇరుకు ఈశ్వరి వ్యక్తి గాదు, శక్తీ గాదు... మహా యుక్తి!' అని స్త్రీలోకమంతా పొగుడుతూంటే... గజలక్ష్మి తన భారీకాయాన్ని చూసుకుని బాధపడేది.

"ఈ ఇరుకు ఈశ్వరి సాంస్కృతిక సేవాసంస్థ నిర్వహిస్తున్న పాతికో కార్యక్రమం 'బాత్రూం పాటల పోటీ'లో కూనిరాగాలు తీయడానికి వచ్చిన మీ అందరికీ హార్దిక స్వాగతం!"

– సభకు అధ్యక్షుడు, కార్యక్రమానికి మేనేజరూ అనదగ్గ బట్టల భగవాన్లు ఈమధ్యనే తాను కట్టించుకున్న బంగారుపళ్ళు బయటకు కన్పించేలా చెబుతున్నాడు.

"క్రితంసారి మీటింగ్‌కి కట్టుకున్న పట్టుచీరే ఇప్పుడూ కట్టుకుంది. కొంచెం మార్చి ఉంటే వెరైటీగా ఉండేది!"

– కొంటెగా అంటున్నాడు... చివరి వరసలో కూర్చున్న వరస సరసమూర్తి.

సరసమూర్తి 'ఇఈ సంస్థ' చేత గతంలో సన్మానింపబడ్డ మనిషే! తర్వాత అటు ఇటుగా వరస తప్పి, దీనంగా తయారయ్యాడు.

మీటింగు మొదలుపెట్టిన బట్టల భగవాన్లు తనకున్న మాటల విరుపులతో విరుచుకు పడుతున్నాడు. సభలో చప్పట్లు కొట్టించడానికి నానా తంటాలు పడుతున్నాడు. కానీ, ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎవరిమటుకు వారు ఈశ్వరి ఇచ్చే ప్రైజ్ మనీ కోసమే ఆలోచిస్తున్నారు.

జనాలు బాగానే వచ్చారు. 'ఇటు అటు పాడు'లోని మనుషులే గాక, ప్రక్క ఊరు పాలెం ప్రజలు కూడా వచ్చి చేరడంతో సభ క్రిక్కిరిసిపోయి ఉంది. తన సామ్రాజ్యం పక్క ఊరు దాకా విస్తరింపబడడం ఆనందాన్ని కలిగించింది ఈశ్వరికి.

"ఈ సంస్థ మొదట 'కొంటె కవితల పోటీ' పెట్టి, విజేతకి రెండువేల రూపాయలు బహుమతిగా ఇచ్చింది. ఆ తర్వాత 'కోళంగి వ్యాసాల పోటీ' నిర్వహించి, గెలుపొందిన వ్యక్తికి రెండుంపాతిక వేలు ఇచ్చింది. ఇక రాష్ట్రంలోనే వినూత్నంగా 'మగవాళ్ళకి ముగ్గుల పోటీ'ని నిర్వహించి, గెలుపొందిన వారికి మూడువేల చెక్కు ఇచ్చి సన్మానించింది.

ఆ తర్వాత... 'అందాల పోటీలు' నిషేధమంటున్నా- ముసలాళ్ళకి అందాల పోటీని నిర్వహించింది. ఇలా దినదిన ప్రవర్ధమానమవుతూ మంచి కార్యక్రమాల్ని అందిస్తూన్న కళాతపస్విని... సాహితీ శిరోమణి... ఇరుకు ఈశ్వరిగారిని అభినందించి తీరాల్సిందే!"

– చెప్పుకుపోతున్నాడు బట్టల భగవాన్లు. మధ్యలో చటుక్కున చప్పట్లకోసం ఆగాడు.

ఎవరూ కొట్టడం లేదు...

ప్రక్కనే ఉన్న ఈశ్వరి చేతులు దగ్గరయ్యాయి... వెంటనే సభలో చప్పట్లు మిన్నుముట్టాయి!

'బాత్రూం పాటల పోటీ' ప్రారంభమయింది!

కనీసం పాట రాని స్వర రాక్షసులందరూ వచ్చి పాడి పోతున్నారు. ఈసారి పోటీ విజేతకు ఐదువేల రూపాయల బహుమతి ప్రకటించడం వల్ల ఎవరికి వారు తమ అదృష్టాన్ని పరీక్షించు కుంటున్నారు. 'ఆడా, మగా' అన్న తేడా లేకుండా వేదిక మీద తాము స్నానం చేస్తున్నట్లుగానే ఊహించుకుని, తన్మయత్వంతో పాటలు పాడి పోతున్నారు.

ఈశ్వరిలోని కళాతృష్ణ తన్మయం చెందుతోంది! గతంలో జనం మొదట పల్చగా ఉండి క్రమంగా పుంజుకునేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. ఎక్కడ చూసినా కరువు కాటకాలు ఎక్కువ కావడంతో ప్రతివాడూ తన అదృష్టాన్ని పరీక్షించుకోవడం కోసం ఎగబడుతున్నాడు.

వరస సరసమూర్తికైతే కడుపు రగిలిపోతోంది! 'కొంటె కవితల పోటీ'లో విజేత తను. స్టేజి మీద ఘనంగా రెండువేల రూపాయల బ్యాంక్ చెక్కుతో సత్కరింపబడ్డాడు. ఆ క్షణంలో ఉబ్బితబ్బిబ్బయిపోయాడు. బాబిగాడు పుట్టువెంట్రుకలు తీయించడానికి వెళ్లవలసిన తిరుపతి ప్రోగ్రాంకి తడుముకోనక్కరలేదని మురిసిపోయాడు.

ఆ ఆనందంతోనే చెక్కును బ్యాంక్‌లో ప్రెజెంట్ చేశాడు.

"ఇరుకు ఈశ్వరి చెక్ మరోటి వచ్చింది సార్!"

– బ్యాంక్ క్యాషియర్ ఎకౌంటెంట్‌తో అరుపులాంటి స్వరంతో అన్నాడు.

ఆ మాట వినేసరికి ఆవేశంతో ఊగిసలాడిపోయాడు ఎకౌంటెంట్!

సరసమూర్తికి అర్థంకాలేదు.

"చెక్ తీసుకుని క్యాష్ పడేయమంటే కేకలు పెడతారేంటి సార్!!"

"ఏంటి ఇచ్చేది..? ఉంటేగా..!" వెట్టిగా అరిచాడు క్యాషియర్.

"చూసి చెప్పండి సార్!" తాను కష్టమర్ అన్న అతిశయాన్ని మాటల్లో నింపుకుని పలికాడు సరసమూర్తి.

"చూడనఖ్ఖరలేదు బాబూ... కృష్ణలో నీరుందో, లేదో తెలియాలంటే ఏటిలో దూకాల్సిన పని లేదు కదా... ఒడ్డున చూసి పట్టేయొచ్చు కదా... ఇదీ అంతే కదా!"

"కదా కదా... అంటూ అంత కాన్ఫిడెంట్‌గా ఎలా చెప్పగల్గుతున్నారు?"

"ఈ బాపతు పాతిక పైబడిన బాధితుడివి నువ్వు!"

సరసమూర్తిలో సత్తువ లుడికిపోయాయి...

ఆవేశం తన్నుకొస్తోంది!

పేపర్లలో మటుకు 'వేలకు వేలు సమాజం కోసం సమర్పించిన త్యాగశీలి ఇరుకు ఈశ్వరి' అంటూ ఫోటో వేసి ఘనంగా వ్రాశారు. తనకు మటుకు ఘాటుగా ఉంది.

ఒకసారి మేనేజర్‌కి కంప్లైంట్ ఇచ్చి 'ఛీటింగ్ కేసు' పెడదామనుకున్నాడు. కానీ, బ్యాంక్ మేనేజర్ కూడా చిలిపి పోటీలో 'ఇఈ' సంస్థ నుండి చెక్కు అందుకున్నవాడే!

ఆరోజు నుంచి 'అక్కరకురాని చెక్కు' విషయాన్ని లోలోపలే దిగమింగుకోవడం నేర్చుకున్నాడు. తన బ్యాంక్ స్టాఫ్‌కి కూడా ఈశ్వరి జోలికి పోకుండా అలవాటు చేశాడు. తన బాధనూ, అక్కసునూ వెళ్లగ్రక్కుకోవడం కోసం తోటి దీనబాధితుల్ని వెతుక్కోసాగాడు సరసమూర్తి. దున్న దీనదయాళ్, చినుకు చిట్టిమూర్తి, కుమ్మరి కూర్మావతారం... తదితర ఈశ్వరి బాధితులంతా తమ బాధల్ని వెళ్లగ్రక్కుకున్నారు.

అందరూ ఒకప్పుడు ఏదో సందర్భంలో ఇరుకు ఈశ్వరి చెక్కుల్ని అందుకున్నవారే! భార్యకు పట్టీలు చేయించాలనో.., కూతురికి కమ్మలు కొనాలనో.., వచ్చిన సొమ్ముల్ని వడ్డీకి తిప్పి లక్షలు సంపాదించేయాలనో... పగటి కలలూ, రాత్రి కలలూ గాక మధ్యాహ్నపు కలల్ని కనసాగారు.

ఎండిన ఎడారిలో కలలకు కముకు దెబ్బలు తగలడంతో కమ్ముకుండిపోయారు. ఎన్ని చెక్కులు రాసి పడేసినా– 'అటు ఇటు పాడు'లో ఇరుకు ఈశ్వరికి ఎట్రాక్షన్ మటుకు తగ్గలేదు.

ఓసారి ఓ ప్రముఖ పత్రిక– ఆమెని పరిచయం చేస్తూ 'బహుమతుల్ని చెక్కుల రూపంలో కాకుండా క్యాష్ రూపంలో ఇస్తే సమంజసంగా ఉంటుందని' సూచన చేసింది.

ఈశ్వరి ఇనుమంతైనా చలించలేదు. ఎంతమాత్రం నిగ్రహం కోల్పోలేదు. మరింత నిబ్బరాన్ని పెంచుకుంది. రెట్టించిన ఉత్సాహంతో 'బాత్రూం కూనిరాగాల పోటీ'లో విజేతకు ఐదువేల రూపాయల బహుమతి ప్రకటించింది.

ఎందరో యువకుల నుండి వృద్ధుల వరకు కట్టలు తెంచుకుని ముందుకు దూకారు. ఆ ఐదువేలు తమకే దక్కాలన్న ఆశతో ఎవరికి తోచిన విధంగా వారు రాగాలు తీయడం మొదలుపెట్టారు.

"ఈశ్వరి పురుష పక్షపాతి! లేకపోతే 'మగవారి ముగ్గుల పోటీ' నుండి 'కొంటె కవితల పోటీ' వరకు ఆడాళ్ళను చిన్నచూపు చూస్తోంది!" అంటూ ఉన్న నోరును కుమ్మరించి యాగీ చేస్తోంది గజం గజలక్ష్మి.

వాయిదాల పద్ధతి మీద చీరల వ్యాపారం చేసే వంపుల వరదశ్రీకి మొండిబాకీలు వసూలు కాకపోవడంతో ఈమధ్య చేతులెత్తేసింది. దాంతో పట్టణంలో అరువు తెచ్చిన షాపులో ఐదువేల దాకా బాకీ ఇవ్వతేలింది. ఈ ఐదువేలు అటు సర్దుకోవచ్చన్న ఆలోచనతో అటూఇటూ బాత్రూం

పాటల్ని ప్రాక్టీసు చేయసాగింది. 'తనూ తగుదునమ్మా...' అంటూ పోటీకి వరదలా వచ్చి పడిపోయింది.

వరదశ్రీకి మాటల రాణి గజలక్ష్మి వత్తాసు పలికింది!

స్త్రీల మనోభావాలను గ్రహించడం వల్లనయితేనేమి, తనమీద పడ్డ 'పురుష పక్షపాతి' అన్న అపవాదు చెరిపేసుకోవాలన్న ఉద్దేశ్యంతోనయితేనేమి- ఈసారి 'ఇఈ' సంస్థ 'బాత్రూం రాగాలు పాటల పోటీ'లో విజేత వరదశ్రీ అయిపోయింది.

ఫలితం ప్రకటించగానే సభలో చప్పట్లు మిన్నుముట్టాయి. వంపుల వరదశ్రీ ఐదువేల బ్యాంక్ చెక్‌తో సత్కరింపబడింది.

"పాపం... అమాయకురాలు!"

– అంటూ వెనుక వరుసలో దీనంగా కూర్చున్న 'ఇఈ' బాధితులందరూ సానుభూతి తెల్పడం తప్ప ఏమీ చేయలేకపోయారు.

డబ్బుకోసం బ్యాంక్‌కి 'వరద గోదావరి'లా పరుగుతీసింది వరదశ్రీ.

షరా మామూలే... 'చెక్కుల పురాణం' క్రమంగా చెవులకు ఎక్కుతోంది! పేపర్లలో చెక్కులకు బదులు క్యాష్ ఇస్తే బాగుండునని ఎందుకు రాశారో ఇప్పుడు అర్థమవుతోంది.

చెల్లని డమ్మీ చెక్కును చూస్తుంటే ఉక్రోషం తన్నుకొస్తోంది ఆమెలో.

ఎంతో కష్టపడి కూనిరాగాలు ప్రాక్టీసు చేస్తే... ఈశ్వరి తనని నీళ్లు లేని నదిలోకి నెట్టేసింది!

ఇక ఉపేక్షించకూడదని నిర్ణయించుకుంది...

మర్నాడు విషయాన్ని పెద్దమనుషుల్లో పెట్టింది వరదశ్రీ!

విన్నవారంతా మిన్నకుండిపోయారు. కారణం... గతంలో అంతా 'ఇఈ'ల బాధితులు కావడమే! మరోప్రక్క జరిగిన అన్యాయానికి ప్రతీకగా వరదలా దూసుకువస్తున్న వరదశ్రీ నీటి మనసుని అభినందించకుండా ఉండలేకపోయారు.

చివరకు తర్జనభర్జనలు చేసి ఇరుకు ఈశ్వరిని అభిశంసించారు. చెక్కుకు బదులు మరోరూపంలో డబ్బులు చెల్లించాలని తీర్పు చెప్పారు.

విన్న ఈశ్వరిలో ఒకింత ఉద్వేగం నెలకొంది. వరదశ్రీకి అడ్డుకట్ట వేయక తప్పలేదు. బాగా ఆలోచించి బుఱ్ఱ బద్దలుకొట్టుకొని ఒక నిర్ణయానికొచ్చింది.

ఆ బాండ్‌ని మర్నాడు భగవాన్లు చేత వరదశ్రీకి పంపింది. దాన్ని అందుకున్న వరదశ్రీలోని వరదలాంటి ఉధృతి తగ్గుముఖం పట్టింది.

తీరా చూస్తే అది పోస్టాఫీస్‌లో తీసుకున్న కిసాన్ వికాసపత్రం!

దాని మెచ్యూరిటీ వేల్యూ ఐదువేల రూపాయలు! అంటే... దాదాపు ఎనిమిదిన్నర సంవత్సరాల తర్వాత గాని వరదశ్రీకి ఐదువేలు చేతికందవు..

ఈసారి నీరుగారిపోవడం వరదశ్రీ వంతు అయింది!

'హాస్యానందం' మాసపత్రిక . . . జూలై' 2005